క్లుప్తంగా

గురుకులకు తీలేర్ విద్యార్థుల ఎంపిక



మరికల్: మండలంలోని తీలేర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనూరాధ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. గురుకుల 5వ తరగతి ప్రవేశం కోసం తమ పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. అలాగే మరికల్ ఫేజ్ఏంజిల్స్ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు గురుకులకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు.

బొడ్రాయి మారుపూజ వేడుకలు



మరికల్: మండల కేంద్రంలో కోట మైసమ్మ, చౌడేశ్వరీ, పోతురాజు, బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించి ఏడాది పూర్తి చేసుకోవడంతో మంగళవారం గ్రామస్తులు ఘనంగా మారుపూజలు నిర్వహించారు. బ్రాహ్మణులచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గ్రామస్తులు బొడ్రాయిలకు, అమ్మవారి విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బోనాలతో నైవేద్యాలను సమర్పించారు.

విజయవంతం చేయండి

ధన్వాడ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీ జిల్లా కేంద్రంలోని ఫిష్ మార్కెట్ ఆవరణలో నిర్వహించనున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను మత్స్యకార్మికులు విజయవంతం చేయాలని ధన్వాడ మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు నర్సిములు నాయుడు కోరారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మత్స్యకార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గౌరవం అందజేస్తున్న మత్స్య దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందని ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న మత్స్య కార్మికులు అందరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



మక్తల్: మండలంలోని కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌సీడీపీఓ అధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కేసీఆర్ కిట్ పంపిణీ చేశారు. ఆమె వెంట శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతు



మక్తల్: మండలం కాట్రేవ్‌పల్లిలో ఎంపీటీసీ సుజాత తాగునీటి బోరుకు మరమ్మతు చేయించారు. గ్రామంలో పోలేరమ్మ ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించినట్లు ఎంపీటీసీ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మోకానిక్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ తరలిన బీఆర్ఎస్ నాయకులు



మరికల్: నాగర్‌కర్నూల్ జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండలం నుంచి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, శేఖర్, రవి, బసంత్, నరసింహారెడ్డి, గోపాల్, నారాయణ, గోవర్దన్, మల్లేష్, విష్ణు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో..

ఆత్మకూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. అమరచింతకు చెందిన శ్రీనివాసులు తన కుమారుడితో కలిసి ఆరేపల్లిలో జరిగిన పెద్దమ్మ పండుగకు హాజరై స్వగ్రామానికి పయనమయ్యాడు. ఆత్మకూర్‌లోని పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో శ్రీనివాసులు తీవ్రగాయాల పాలయ్యాడు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మాగనూర్ మండలం ఉజ్జెల్లిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మరికల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అక్కడ జీవనం సాగిస్తున్న బుడగజంగాల గుడిసెల వద్ద బడిఈడు పిల్లలను గుర్తించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌కు బదులుగా ప్రభుత్వ పాఠశాల్లో చదివిస్తే అనేక ఉచిత వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఎంఓ రాజేంద్రకుమార్, సెక్టోరియల్ అధికారి నాగార్జున్‌రెడ్డి, హెచ్ఎం పద్మలత, సీఆర్పీలు అరుణ, శివకుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోస్గి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గుండుమాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్రాముడు కోరారు. మండల కేంద్రమైన గుండుమాల్‌లో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయ బృందం మంగళవారం 'బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బడిబయట పిల్లల వివరాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తుందని చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీ దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. హెచ్ఎం సునంద, ఉపాధ్యాయులు భ్రమరాంబ, శిరీష, గోపాల్ పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ బడులోనే చిన్నారులకు బంగారు భవిష్యత్తు సాధ్యమని నేరడగం కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటయ్య, కోల్పూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం బడిబాటలో భాగంగా వారు ఉజ్జెల్లిలో 24 మంది, కోల్పూర్‌లో 10 మంది బడిబయట విద్యార్థులను గుర్తించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కృష్ణయ్య, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

నర్వ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచే లక్ష్యంతో ప్రారంభమైన బడిబాట కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా లక్కర్‌దొడ్డి, యాంకి పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలో చిన్నారులచే ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్ఎం నర్సిములు, రాణి, సీర్పీలు నర్సిములు, రోజా తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో బడిబాటలో పిల్లలను గుర్తించిన అధికారులు



గుండుమాల్‌లో ఇంటింటి ప్రచారంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం



ఊట్కూరులో ..

ఘనంగా మైసమ్మ ఉత్సవాలు



మైసమ్మకు జల్డి ఊరేగింపు చేస్తున్న భక్తులు

మద్దూరు: మండల కేంద్రంలోని ఎండ్ల బజారులోని మైసమ్మ ఆలయం ఉత్సవాలు మంగళవారం ఎంపీటీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పోచమ్మ ఆలయం నుంచి మేళతాళాల మధ్య జల్డి ఊరేగింపు పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు కొనసాగింది. అనంతరం పూజారి రాఘవేంద్రచారీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ఇతర పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు డప్పుల చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే నిడ్జింతలో పోచమ్మకు బోనాలెత్తి మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు నర్సిములు, మల్లప్ప, కృష్ణయ్య, చెన్నప్ప, ఆనంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల కేంద్రంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. గోవా నుంచి కారులో తరలిస్తున్న 32 బాటిళ్ల మద్యం గుర్తించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మద్యాన్ని తీసుకొస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు



అమరచింత పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పట్టణంలోని పెద్ద చెరువును మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో సామూహిక భోజనాల ఏర్పాటు కోసం చెరువు పరిసరాలను పరిశుభ్ర పరిచే కార్యక్రమాలను యంత్రాల సహకారంతో చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులతో బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహమ్మద్‌ఖాజా, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం



కోస్గి: గుండుమాల్ మండల కేంద్రం నుంచి ముదిరెడ్డిపల్లి వాగు వంతెన వరకు మట్టి రోడ్డు పనులను మంగళవారం ఎంపీపీ మధుకర్ రావు ప్రారంభించారు. రూ.8 లక్షల సీడీపీ నిధులతో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నర్సిములు, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి దేవర్లు

ఆత్మకూర్: గ్రామ దేవత పెద్దమ్మతల్లి దేవర్లను రేచింతల, ఆరేపల్లి గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులోని పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా గొర్రెలను బలి ఇచ్చి నైవేద్యంగా సమర్పించారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆలయంలో పూజలు చేసి, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో వేలాది సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పూజల్లో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటీష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి కుమార్‌యాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అనసూయ, యుగేంధర్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పూజలు..

రేచింతల, ఆరేపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన పెద్దమ్మతల్లి దేవర్లలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవాలు



మక్తల్: మండలం కాట్రేవ్‌పల్లిలో మంగళవారం పోలేరమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదివిధంగా వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి గ్రామానికి చెందిన అంజమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.51వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆయన నివాసంలో బాధిత కుటుంబ సభ్యుడికి చెక్కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, వాకిటి మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కెట్ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు

మక్తల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పడమటి ఆంజనేయస్వామి, నల్లజానమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కేట్ కట్ చేసి తినిపించారు. అనంతరం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ చైర్మన్ దేవరి మల్లప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సర్పంచ్ దత్తూ, మాజీ సర్పంచ్ గోవర్దన్‌రెడ్డి, ధనలక్ష్మి, మఠంరాధిక, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కావలి తాయప్ప, కృష్ణయ్యగౌడ్, శంకర్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలో 1994–95 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను స్మరించుకోవడం కోసం పాఠశాలను సందర్శించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యా బుద్దులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి, సన్మానించారు.

ఘనంగా ఎల్లమ్మ బండారు ఉత్సవం



బండారు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బండారు ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బిజ్వార్ మాజీ సర్పంచ్ శివలింగమ్మ, నాయకులు విజయ్‌గౌడ్, నాగప్ప, సురేందర్, మల్లికార్జున్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది గడుస్తున్నా అందని కూలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దామరగిద్ద: ఉపాధి కూలీల పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉడ్మల్‌గిద్దలో కూలీల పని ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. పనిచేసిన వారం రోజుల్లో కూలి డబ్బులు అందించాలని కోరారు. గ్రామంలో గతేడాది పనిచేసిన 100 మంది కూలీలకు నాలుగు వారాల డబ్బులు ఏడాది గడుస్తున్నా అందలేదని వాపోయారు. కేంద్రం బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.25 వేల కోట్ల నిధులు తగ్గించి పథకాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వేసవి ఎండల తీవ్రతతో వడదెబ్బకు గురవుతున్న టెంట్లు, హెల్త్ కిట్‌లు తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, భీంషప్ప, వెంకటప్ప, బాల్‌రెడ్డి, నర్సిములు కొండప్ప పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలో 'జలసిరులు'



ధన్వాడ చెరువులో పట్టిన చేపలు



వలలో పడిన చేపలు

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మంగళవారం మత్స్యసహకర సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు చేపలను పట్టారు. చెరువు నీరు ఈసారి పూర్తిగా ఎండిపోవడంతో చేపలను పట్టేందుకు చర్యలు తీసుకున్నారు. పట్టిన చేపలను మత్స్యకార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నీరటి నర్సిములునాయుడు, ఉపాధ్యక్షుడు బాల్‌నర్సిములు, కార్యదర్శి గుండ్లకుంట నర్సిములు, డైరెక్టర్లు ఆనంద్, బాలస్వామి, అశోక్, శ్రీనివాసులు, మనెమ్మ, రామచంద్రయ్య, వెంకటప్ప, భాస్కర్, రాములు, బాబు, భీంషేన్, శివ తదితరులు ఉన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలబాలికలు

బహుమతుల ప్రదానం

మక్తల్: ఈ నెల 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి, సబ్ జూనియర్ బాల బాలికలు సైకిల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి సైకిల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం విజేతలకు బహుమతులతో పాటు నగదు, మెడల్స్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వి.శ్రీహరి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి గోపాలం, అంబ్రేస్, శ్రీనివాస్ రెడ్డి, పి.నర్సింహగౌడ్, సత్యఅంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

మదనాపురం: దేశానికి, రాష్ట్రానికి బీజేపీ ద్వారానే సుస్థిర పాలన లభిస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి దంతనూరు మాధవరెడ్డి వెల్లడించారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గని నరసింహులు జన్మదిన సందర్భంగా ఆయా గ్రామాల బీజేపీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ప్రశాంత వాతవరణం నెలకొందని చెప్పారు. ఎన్నికల ముందు తప్పుడు వాగ్దానాలతో ప్రజలకు మభ్యపెట్టేందుకు నాయకులు వస్తున్నారని, అలాంటి నాయకులను ప్రజలు గుర్తించి గుణపాఠం చెప్పాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాలు నిర్వహించే హక్కు ప్రభుత్వానికి లేదు

అమరచింత: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో గ్రామాల్లో సంబురాలు నిర్వహించడం వింతగా ఉందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంతు ఎద్దేవా చేశారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలోలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. రూ.ఐదు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని ఆరోపించారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడన్నారు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వడంలో ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశారని, పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నాడని విమర్శించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వలేక పోయారని, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని స్పష్టంచేశారు. బంగారు తెలంగాణ అంటూ అందినంత దోచుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. దీక్ష దివాస్ సందర్భంగా ఈనెల 8న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, 12న జిల్లా కేంద్రంలో దీక్ష దివాస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, నాయకులు వెంకటేష్, రాజు, మురళి, జనార్దనమ్మ, శైలజ, మహేశ్వరమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎమ్మెల్యే కృషి

- సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లలో జలకళ
- రూ.2 వేల కోట్లతో వివిధ పనులు



సంగంబండ రిజర్వాయర్ గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

మక్తల్: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నదే ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సంకల్పం. దీనికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి రూ.2 వేల కోట్ల నిధులను మంజూరు చేయించి రిజర్వాయర్ల నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే కాలువ నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో కాలువల ద్వారా సాగునీరు సరఫరా చేసి గ్రామాల్లోని చెరువులను నింపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పంటల సాగు జోరందుకుంది. వానాకాలం, యాసంగి పంటలకు సమృద్ధిగా సాగునీరు అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో కూడా సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లలో జలకళ సంతరించుకుందంటే ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది. యాసంగిలో కూడా పంటల దిగుబడి అధికంగా ఉంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం తంగిడి నుంచి ఆత్మకూర్ మండలం వరకు కృష్ణానది సరిహద్దుల్లో ఉన్న సాగుచేసిన వరి పంటలకు ఊరట లభించింది. అదేవిధంగా మక్తల్ మండలం పస్పుల, పంచదేవ్‌పహాడ్, దాదన్‌పల్లి, ముష్టిపల్లి, అనుగొండ, పారేవుల, మూడుమాల్, కొల్పూర్, మందిపల్లి, వాసునగర్, కృష్ణ, హిందుపూర్, గుడెబల్లూర్ రెండు పంటలకు పుష్కలంగా నీరు అందుతుండటంతో నదీతీర ప్రాంతాల రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

పుష్కలంగా సాగునీరు..

భూత్పూర్ రిజర్వాయర్ కాలువ నుంచి చెరువులకు సాగునీటిని సరఫర చేస్తున్నారు. అలాగే మక్తల్ చెరువుకు కాల్వ నుంచి నీటిని విడుదల చేసేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారు. అదేవిధంగా సంగంబండ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి ఉజ్జెల్లి, సోమేశ్వర్‌బండ, మాద్వార్, సంగంబండ, గ్రామాలకు చెందిన రైతులు పైపులైన్ల నుంచి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మక్తల్ నియోజకవర్గంలో 85 చెరువులకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించారు. ప్రస్తుతం చెరువులకు రిజర్వాయర్ల నుంచి చెరువుకు సాగునీరు విడుదల చేశారు. దీంతో రైతులు వానాకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు ముమ్మరంగా సాగు చేసుకుంటున్నారు. రెండు రిజర్వాయర్లలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం..

రైతుల కళ్లల్లో సంతోషం చూడటమే నా లక్ష్యం. నియోజకవర్గంలోని అన్ని మండలాల చెరువులకు సాగునీరు అందిస్తాం. వానాకాలం, యాసంగి సీజన్‌లో రెండు పంటలకు సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నా. గతేడాది కంటే ఈ ఏడాది ముందే సాగునీరు విడుదల చేశాం. లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తాం. ప్రస్తుతం భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్ల నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

– ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మక్తల్